147వ అధ్యాయం

١٤٧ - بَابُ مَا يَقُولُهُ مَنْ أَيِسَ مِنْ حَيَاتِهِ

జీవితం మీద ఆశలు వదులుకున్నవాడు ఏమని ప్రార్థించాలి?

٩١١ - عن عائشةَ رضيَ اللهُ عنها قالت: سَمِعْتُ النبيَّ ﷺ وَهُوَ مُسْتَنِدٌ إلَيَّ يَقُولُ: «اللَّهُمَّ! اغْفِرْ لي وَارْحَمْني، وَأَلْحِقْني بالرَّفِيقِ الأَعْلَى» متفق عليه.

911. హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లం) నిర్యాణ సమయంలో నా దేహానికి తన వీపుని ఆనించి కూర్చున్నారు. ఆ సమయంలో తను ఈ విధంగా ప్రార్థిస్తుండగా నేను విన్నాను : "దేవా! నన్ను క్షమించు. నాపై దయజూపు. నన్ను సర్వోన్నత మిత్రునితో కలుపు." *(బుఖారీ - ముస్లిం)*

(సహీహ్ బుఖారిలోని వ్యాధిగ్రస్తుల ప్రకరణం, సహీహ్ ముస్లింలోని సలాం ప్రకరణం)

ముఖ్యాంశాలు

సర్వోన్నత మిత్రుడంటే దేవుడేనని అత్యధికమంది పండితులు భావిస్తున్నారు. మరికొందరి అభిప్రాయం ప్రకారం దైవదూతలు, దైవప్రవక్తలు, అమరవీరులు, సదాచార సంపన్నులు కూడా సర్వోన్నత మిత్రులు కావచ్చు. హజ్రత్ యూసుఫ్ (అలైహి) దేవుడు తనను సదాచార సంపన్నులలో కలపాలని ప్రార్థించారు. దైవప్రవక్త (సల్లం) కూడా ఆ విధంగానే ప్రార్థించి ఉంటారని వారి అభిప్రాయం. ఏది ఏమైనా జీవితపు చివరి ఘడియల్లో మనిషి ఐహిక భవబంధాలన్నిటితో తెగత్రెంపులు చేసుకొని పరలోక జీవితం కోసం శ్రమిస్తూ ఉండాలి.

٩١٢ - وعنها قالت: رَأَيْتُ رسولَ اللهِ ﷺ وَهُوَ بالمَوْتِ، عِنْدَهُ قَدَحٌ فِيهِ مَاءٌ، وَهُوَ يُدْخِلُ يَدَهُ في القَدَحِ، ثُمَّ يَمسَحُ وَجْهَهُ بالماءِ، ثم يقول: «اللَّهُمَّ!

912. హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) గారే చేసిన కథనం : దైవప్రవక్త (సల్లం) మరణ వ్యాధికి గురయి ఉన్నప్పుడు నేనాయన్ని చూశాను. ఆ సమయంలో ఆయన దగ్గర నీళ్ళతో నిండి ఉన్న ఓ పాత్ర ఉండేది. ఆయన ఆ పాత్రలో చేతిని

أَعِنِّي عَلى غَمَرَاتِ المَوْتِ وَسَكَرَاتِ المَوْتِ». رواه الترمذي.

ముంచి తీసి, తడి చేత్తో ముఖాన్ని తుడుచుకుంటూ, "దేవా! మరణ కాలపు కాఠిన్యంలో, అపస్మారక ఘడియల్లో నాకు సహాయపడు" అని ప్రార్థించేవారు.

(తిర్మిజీ)

(సుననె తిర్మిజీలోని జనాయెజ్ అధ్యాయం)

ముఖ్యాంశాలు

దైవప్రవక్త (సల్లం) మానవమాత్రులేనని పై హదీసు ద్వారా బోధపడుతోంది. సాధారణంగా మానవులకు వచ్చేవిధంగా ఆయనకు కూడా తీవ్రమైన వ్యాధివచ్చింది. ఆ వ్యాధి తాలూకు బాధను కూడా ఆయన అనుభవించారు. జీవితపు చివరి రోజుల్లో ఆయనకు విపరీతమైన జ్వరం వచ్చింది. తీవ్రమైన ఆ జ్వరం వేడి కారణంగానే ఆయన మాటిమాటికీ చేతులు నీటిలో ముంచి తడిచేతులతో ముఖం తుడుచుకునేవారు. అదేవిధంగా ప్రాణం పోతున్నప్పుడు సాధారణంగా మనుషులకు ఎలాంటి బాధ అయితే కలుగుతుందో దాన్ని కూడా ఆయన అనుభవించారు. మరణ బాధను తగ్గించమని కూడా ఆయన అల్లాహ్‌ను వేడుకున్నారు.

షేఖ్ అల్ బానీ ఈ హదీసును బలహీనకోవకు చెందిన హదీసుగా నిర్ధారించి 'జయీఫ్ సుననె తిర్మిజీ' క్రింద పేర్కొన్నారు. అయితే దైవప్రవక్తకు మరణావస్థలో అపస్మారక స్థితి ఆవరించిందని ప్రామాణికమైన హదీసుల ద్వారా కూడా రుజువు అవుతోంది (బుఖారీ గ్రంథంలోని మగాజీ ప్రకరణం చూడండి).

పైన పేర్కొనబడిన రెండు హదీసుల ద్వారానూ మనిషి, ముఖ్యంగా జీవితపు అంతిమ దశలో దైవసహాయాన్ని కోరుకుంటూ ఉండాలని బోధించబడింది.